నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, గురువారం 16 మే 2024 | NALGONDA

## ఓట్ల డూప్లికేషన్‌పై ఈసీకి ఫిర్యాదు చేస్తాం

**బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి**

నల్లగొండ రూరల్, మే 15 : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో ఒక్కో ఓటరు రెండేసి ఓట్లు వేసిన అంశాన్ని సీరియస్‌గా తీసుకొని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 41వ వార్డులోని పోలింగ్ స్టేషన్ 176,137లో పోలైన ఓటరు నంబర్ ఎన్‌జెడ్‌ఏ 2589125, ఎన్‌జెడ్‌ఏ 2526655 ఒక్కరే కావడంతో ఈ విషయాన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు న్యాయ నిపుణులను సంప్రదించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే తిరిగి పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఈ వార్డులో ఇదే తరహాలో 100 ఓట్ల వరకు పోలైనట్లు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. 42వ వార్డులో పోలైన ఓట్లు 41 వార్డులో కూడా పోలైనట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, రీపోలింగ్ అయ్యే వరకు కౌంటింగ్ నిలిపివేయాలని ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం అధికారులు రంగంలోకి దిగి డూప్లికేషన్‌కు సంబంధించిన అంశాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## కేవీకేలో విత్తన మేళా

త్రిపురారం, మే 15 : మండలంలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా విత్తనాల మేళా నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాస్‌రావు తెలిపారు. నల్లగొండ జిల్లాలోని రైతులకు మేలైన, నాణ్యమైన విత్తనాలను అందించాలన్న ఉద్దేశంతో మెగా విత్తనాల మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేవీకే ఆధ్వర్యంలో వరి విత్తనాలు జేజీఎల్ 27356 అతిన సన్న గింజ రకం 15కిలోల బ్యాగ్ రూ.750, కేఎన్ఎం 118 దొడ్డు రకం 25కిలోలు రూ.1100, జేజీఎల్ 24423 దొడ్డు గింజ రకం 25కిలోలు 1100 రూపాయలకు లభిస్తాయని.. వ్యవసాయ పరిశోధన స్థానంలో కేఎన్ఎం 118 దొడ్డురకం 25కిలోలు రూ.1100, ఎంటీయూ 1010 దొడ్డురకం 25కిలోలు రూ.1100, కేపీఎస్ 2874 సన్న రకం 20కిలోలు రూ.1556, కేపీఎస్ 6251 సన్నరకం 25కిలోలు రూ.1200కు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 24న ఉదయం 11గంటలకు కేవీకేకు విచ్చేయాలని, మరిన్ని వివరాల కోసం 7702544771, 9949301819 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత

- ప్రశాంతంగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ
- నల్లగొండ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నీలగిరి, మే15 : నల్లగొండ పార్లమెంట్ పరిధిలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో 74.03 శాతం పోలింగ్ నమోదైందని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా మరో 2 శాతం నమోదైనట్లు తెలిపారు.7 నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచామని, అక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉంటుందని తెలిపారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు చెప్పారు. ఈ ఉప ఎన్నిక నియోజకవర్గ పరిధి 12 జిల్లాల్లో ఉందని, 12 మంది అదనపు కలెక్టర్లు ఏఆర్‌ఓలుగా ఉన్నారని, పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టుకోవచ్చని, అందుకు సంబంధించి అనుమతులు జిల్లా స్థాయిలోనైతే ఏఆర్‌ఓల వద్ద, మొత్తం నియోజకవర్గమైతే నల్లగొండలోని ఆర్‌ఓ కార్యాలయంలో అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పార్లమెంట్ ఎన్నికల లాగానే ఉంటుందని, అభ్యర్థులు ఏవైనా ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ఎంసీఎంసీ వద్ద ప్రీ సర్టిఫికేషన్ తీసుకోవాలన్నారు. ఈ నెల 27న పోలింగ్ ఉంటుందని, నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశామని, అక్కడి నుంచే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల పంపిణీ ఉంటుందని తెలిపారు. పోలింగ్ అనంతరం 12 జిల్లాలకు చెందిన బ్యాలెట్ బాక్స్‌లను నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించనున్నట్లు చెప్పారు. జూన్ 5న కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో మీడియా సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

- రిటర్నింగ్ అధికారిహరిచందన

నీలగిరి, మే15 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బ్యాలెట్ బాక్స్‌లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణపై అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి ఆమె పాల్గొని ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు వివరించారు. శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన విషయాలు, పాటించకూడని అంశాలపై అభ్యర్థులకు బుధవారం జరిగిన సమావేశంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఏఆర్‌ఓలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మ్యానువల్‌గా ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల లాగానే ఎఫ్ఎస్‌టీ బృందాలు కొనసాగుతాయని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎన్నికల అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేశ్ కుమార్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, చండూరు ఏఆర్‌ఓ సుబ్రహ్మణ్యం, మిర్యాలగూడ ఏఆర్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్
- వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష



వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, మే 15 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేయాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణపై అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి బుధవారం జిల్లా అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉన్నందున జిల్లాలోని 71 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతి డివిజన్‌లో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బందిని సమకూర్చాలని సూచించారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు నిఘా పెంచాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం నేడు నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ అప్పారావు, ఆర్డీఓలు వేణుమాధవ్, శ్రీనివాస్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా..

నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థి అనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార సరళి తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.





సమావేశంలో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపిక, భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాంచందర్‌నాయక్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, చెరుకు సుధాకర్, కటికం సత్తయ్యగౌడ్, గుజ్జ యుగంధర్‌రావు, సూర్యాపేట జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# దోచినా దొరక్కుండా!

- ధాన్యం అమ్మేసి.. ఆస్తులు బదిలీ
- కేసులు నమోదైనా తప్పించుకునే ప్లాన్
- లొసుగును అడ్డం పెట్టుకొని గతంలో మాయచేసిన పలు మిల్లులు

## సీఎంఆర్ ఎగవేతకు పలు మిల్లర్ల యత్నం



సూర్యాపేట, మే 15 (నమస్తే తెలంగాణ) : అక్రమాలకు పాల్పడిన, పాల్పడుతున్న పలు పారాబాయిల్డ్ రైస్ మిల్లుల యాజమాన్యాలు భారీ దోపిడీకి తెరలేపుతున్నట్లు తెలుస్తున్నది. రెవెన్యూ రికవరీ యాక్ట్‌లోని లొసుగులను అదునుగా చేసుకొని వందల కోట్ల రూపాయలను ప్రభుత్వానికి ఎగవేతకు సిద్ధం చేసినట్లు పలువురు మిల్లర్లే చెబుతున్నారు. సూర్యాపేట జిల్లాలో గత నాలుగైదు సీజన్లుగా ఒక్కో మిల్లు రూ.150 నుంచి రూ.200 పైనే విలువ చేసి ధాన్యాన్ని కస్టం మిల్లింగ్ కోసం తీసుకున్నాయి. వాటిలో 5 నుంచి 10 శాతం కూడా బియ్యం ప్రభుత్వానికి ఇవ్వని మిల్లులు 10 నుంచి 12 ఉన్నాయి. ఈ మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని గత పదిహేను రోజులుగా బయట తెగనమ్ముకుంటున్నారని, మరోవైపు మిల్లు యజమానులు, వారి కుటుంబ సభ్యుల పేరిట ఉన్న ఆస్తులను ఇతరుల పేరిట బదిలీ చేస్తున్నారని సమాచారం. ఎలాంటి కేసులు నమోదైనా కొద్ది రోజులు జైలులో ఉండి బెయిల్‌పై రావచ్చనేది వారి ఆలోచనలో భాగమని తెలుస్తున్నది.

### గతంలో ఇలానే..

కోదాడ సమీపంలోని ఓ మిల్లులో గతంలో సుమారు రూ.35 కోట్ల విలువ చేసే ధాన్యం మాయమైతే యజమానిపై కేసు నమోదు చేసి మిల్లును సీజ్ చేశారు. ఆ మిల్లులో వందకు పైనే మంది పనిచేస్తుండడం, వారికి ఉపాధి కరువవుతుందనే కోణంలో కోర్టుకు వెళ్లి తిరిగి మిల్లును తెరిపించుకున్నారు. ప్రస్తుతం ఆ మిల్లునే జిల్లాలోని అక్రమార్కులు ఆదర్శంగా తీసుకుంటున్నారని ఓ మిల్లు యజమాని పేరు బహిర్గతం చేయడానికి నిరాకరిస్తూ పేర్కొన్నాడు. జిల్లాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఇప్పటికే రెండుగా చీలాయి. రెండు వర్గాల్లోని సుమారు 10 నుంచి 12 మిల్లులు గత నాలుగేండ్లుగా దాదాపు రూ.600 నుంచి రూ.700 కోట్ల విలువ చేసే ధాన్యం తీసుకున్నాయి. కానీ సీఎంఆర్‌ను ప్రభుత్వ సంస్థలైన ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్‌కు అతి తక్కువగా ఇచ్చాయి. దాంతో ఆయా మిల్లులను అధికారులు డీఫాల్ట్‌గా ప్రకటించి ఈసారి కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యం కేటాయించలేదు. అంతే కాకుండా మిల్లుల్లో తనిఖీలు చేసి మూడు మిల్లులపై కేసులు కూడా నమోదు చేశారు. ఇక తమ ఆటలు చెల్లవనుకున్న అక్రమార్కులు ప్రభుత్వాన్ని మోసం చేయాలనే ఆలోచనకు వచ్చినట్లు, అధికారులు ఎన్నికల బిజీలో ఉండడాన్ని అవకాశంగా తీసుకొని మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని ప్రైవేట్‌గా అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో మిల్లు యజమానులు తమ కుటుంబ సభ్యుల పేరిట ఉన్న ఆస్తులను ఇతరుల పేరిట బదిలీ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేసులైన మిల్లులతోపాటు ఇతర మిల్లుల్లో యుద్ధప్రాతిపదికన తనిఖీలు చేసి అధిక బాకీలు ఉన్న మిల్లులకు కస్టోడియన్లను నియమిస్తే తప్ప అక్రమాలను అరికట్టడం కష్టమని పలువురు మిల్లర్లు చెబుతున్నారు. మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం మాయమవుతున్న విషయమై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాములును ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.





## రేపటి నుంచి ఎంజీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు చేసిన వర్సిటీ పరీక్షల విభాగం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో 46 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 54,444 మంది విద్యార్థులు

రామగిరి, మే 15 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఈ నెల 17నుంచి జూన్ 16 వరకు వివిధ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి వర్సిటీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. అయితే ఉన్నత విద్యామండలి నిబంధనల మేరకు పరీక్షల నిర్ణీత సమయం కంటే నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమితి ఉండదని పరీక్షల విభాగం ఇప్పటికే వెల్లడించింది. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రత్యేక పరిశీలకులు అప్రమత్తంగా ఉండి పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

### హాజరుకానున్న 54,444 మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ రెగ్యులర్ 2, 4, 6 సెమిస్టర్లతోపాటు 1, 3, 5 సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల నిర్వహణకు 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఆయా సెమిస్టర్ల పరీక్షలకు మొత్తం 54,444 విద్యార్థులు హాజరుకానున్నట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి డా।। జి.ఉపేందర్‌రెడ్డి, అసిస్టెంట్ పరీక్షల అధికారిణి డా।। లక్ష్మీప్రభ వెల్లడించారు. రెగ్యులర్ విభాగంలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరిగే 2వ సెమిస్టర్ పరీక్షలకు 12,525, నాలుగో సెమిస్టర్ 12,313, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 11,554 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే బ్యాక్‌లాగ్ పరీక్షల్లో భాగంగా సెమిస్టర్-1 పరీక్షలకు 6,923, సెమిస్టర్-3 6,050, సెమిస్టర్-5 పరీక్షలకు 5,079 మంది కలిపి మొత్తం 54,444 మంది పరీక్షలు రాయనున్నారు.

## శాలిగౌరారం ప్రాజెక్టుకు జలకళ

**14 అడుగులకు చేరిన నీటి మట్టం**

శాలిగౌరారం, మే 15 : శాలిగౌరారం ప్రాజెక్టు నీటి మట్టం పెరుగుతున్నది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మూసీ నది ప్రవహిస్తుండడంతో రామన్నపేట మండలం పల్లివాడ హెడ్‌వర్క్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతున్నది. గత నెల క్రితం అడుగంటిన ప్రాజెక్టులోకి వరద నీరు రావడంతో జళకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 21అడుగులకు ప్రస్తుతం 14అడుగులు ఉన్నది. దాంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శాలిగౌరారం ప్రాజెక్టు

## రవీంద్రకుమార్‌కు మండలి చైర్మన్ గుత్తా పరామర్శ




రత్యాతండాలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పక్కన రవీంద్రకుమార్

దేవరకొండ రూరల్, మే 15 : దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ ఇటీవల మృతి చెందగా, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బుధవారం మండలంలోని రత్యాతండాలో రవీంద్రకుమార్ నివాసానికి వెళ్లి కనిలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి కనిలాల్ రత్యాతండా సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి ఎంతో కృషిచేశారని ఆయన సేవలను గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ చింతపల్లి సుభాశ్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, నాయకులు జైహింద్‌రెడ్డి , ఎండీ యూనుస్, శిరందాసు కృష్ణయ్య పాల్గొన్నారు.

## ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత



సోమరిపాయ అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

చందంపేట, మే 15 : నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్ పిట్స్ వద్దకు వివిధ అటవీ జంతువులు దాహం తీర్చుకునేందుకు వచ్చి ట్రాప్ కెమెరాలకు చిక్కాయి. అందులో ఒక చిరుత కూడా ఉన్నది. చందంపేట మండలం కంబాలపల్లి రేంజ్ పరిధి మబ్బుచేనులోని సోమరిపాయ అటవీ ప్రాంతంలో సుమారు 78 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ తెలిపారు. చిరుత దృశ్యాలతో పాటు మరికొన్ని జంతువుల ఫొటోలు ట్రాప్ కెమెరాలో చిక్కినట్లు ఆయన చెప్పారు. అటవీ జంతువుల సంరక్షణకు ఎఫ్ఆర్ఓలు భాస్కర్, సాయి ప్రకాశ్ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.